## క్లుప్తంగా

### ఉపాధ్యాయులు ఆదర్శవంతంగా ఉండాలి

**అశ్వారావుపేటరూరల్:** ఆదర్శవంతమైన సమాజాన్ని తీర్చిదిద్దడంతో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని, అందుకే ప్రతి టీచర్ ఆదర్శ వంతంగా ఉండాలని ఎంఈఓ కీసరి లక్ష్మి అన్నారు. శనివారం జరిగిన అశ్వారావుపేట కాంప్లెక్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ఉన్నత ప్రమాణాలతో పని చేయాలని, అప్పుడే విద్యార్థులు క్రమశిక్షణగల పౌరులుగా తయారవుతారని అన్నారు. అనంతరం నూతనంగా ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీను కాంప్లెక్స్ ఉపాధ్యాయులంతా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు హరిత, నర్సింహారావు, రాంప్రసాద్, సీఆర్పీ ప్రభాకరాచార్యులు, టీచర్లు పాల్గొన్నారు.

### రెండో రోజు కొనసాగిన దీక్షలు

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అల్లాడి పాల్‌రాజ్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం సుప్రీం కోర్టుకు తీర్పు ఇచ్చే అధికారంలేదని, పార్లమెంట్‌లో రాష్ట్రాల అభిప్రాయం మేరకు రాష్ట్రపతి ఆమోదం పొందిన సుప్రీం కోర్టు తీర్పు వెలువడించాలని పేర్కొన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 4న తలపెట్టిన జిల్లా కలెక్టరెట్ల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### ‘సీతారామ’ నీరు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

**అశ్వాపురం:** సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగు నీరు మొదట అశ్వాపురం మండలానికే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు మొదటగా మండలంలోని చెరువులు అన్నింటికి ఇచ్చేవరకు ఉద్యమించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో అన్నవరపు కనకయ్య హాజరై మాట్లాడారు. రుణమాఫీ, సీజనల్ వ్యాధులపై పలు డిమాండ్‌లను వివరాలు సమావేశంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గద్దల శ్రీనివాసరావు, ఎంవీ.నాగభూషణం, అశోక్ రెడ్డి, కొప్పుల పద్మ, దండి రాములు, సాంబశివరావు నాయకులు పాల్గొన్నారు.

### మహాసభలను జయప్రదం చేయండి

**దుమ్ముగూడెం:** కొత్తగూడెంలో జరుగనున్న ఐద్వా మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి యం.జ్యోతి పిలుపునిచ్చారు.శనివారం ములకపాడు గ్రామంలోని వైయస్ భవన్‌లో ఐద్వా మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షురాలు సోయం సుశీల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. సెప్టెంబర్ నెలలో జరుగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మన భారతదేశంలో రోజురోజుకీ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదని అన్నారు. ప్రతి మండలంలో మహిళా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో, జిల్లా ఉపాధ్యక్షురాలు డి. సీతామాలక్ష్మి, జిల్లా నాయకురాలు ఎస్.లీలావతి,మాజీ సర్పంచ్ మీడియం జయ, పూనేం కనకదుర్గ, సోయం నాగమణి, కల్లూరి దేవి, సోయం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

### విగ్రహా ప్రతిష్ఠకు భూమి పూజ

**దుమ్ముగూడెం:** మండలంలోని ములకపాడు గ్రామంలో ఏర్పాటు చేయనున్న కొమరం భీం విగ్రహ ప్రతిష్ఠాపనకు శనివారం ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు భూమి పూజ నిర్వహించారు. ములకపాడు జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహం పక్కన ఆదివాసీల ఆరాధ్య దైవం భీం విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేయడం జరిగిందని ఆదివాసీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కొమరం దామోదర రావు, సోయం కామరాజు, సరియం కోటేశ్వరరావు, రాజమ్మ,మాజీ జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, మాజీ ఎంపీటీసీలు సోడి తిరుపతిరావు, తెల్లం భీమరాజు,నాయకులు కణితిరాముడు, తెల్లం హరి,కారం పుల్లయ్య, కణితి లక్ష్మణుడు, ముర్రం వీరభద్రమ్, పోడియం సుబ్బారావు, కోడి చంటి, వాగేకృష్ణ, కుర్సం రవి,కొంద్రు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# బొజ్జ గణపయ్య ముస్తాబు..

- వినాయక చవితికి విగ్రహాలు రెడీ
- తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు
- భద్రాద్రి కేంద్రంగా సరిహద్దు రాష్ట్రాలకు విక్రయం



విక్రయానికి సిద్ధంగా ఉన్న గణనాథులు



శివుడు, పార్వతితో గణపయ్య రూపం..

సండే స్పెషల్

**భద్రాచలంటౌన్:** పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా వాడవాల కొలువుదీరి భక్తులచే పూజలందుకునేందుకు తీరొక్క రూపాల్లో అందంగా రంగులద్దుకుని బొజ్జ గణపయ్య ముస్తాబవుతున్నాడు. ఈ నెల 7న వినాయక చవితికి ప్రతిష్ఠించేందుకు విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే డివిజన్‌లో భద్రాచలంతో పాటు పలు మండల కేంద్రాలల్లో తయారీదారులు విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. అలాగే సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, ఆంధ్రల నుంచి ప్రజలు భద్రాచలం వచ్చి విగ్రహాలను భారీగా విక్రయిస్తారు. ఇందు కోసం వారం రోజుల ముందుగానే వచ్చి విగ్రహాలను ఏరికోరి తెచ్చుకుంటారు. మరి కొందరు విగ్రహాలకు అడ్వాన్స్ ఇచ్చి మంచి రోజు చూసుకొని తీసుకెళ్తుంటారు. ఈ క్రమంలో భద్రాద్రి కేంద్రంగా భారీగా గణపతి విగ్రహాలు విక్రయం జరుగుతుండడంతో సమీప ఏపీ రాష్ట్రంలోని ఎటపాక గ్రామంలో సైతం వ్యాపారులు తయ్యారీ కేంద్రాలను ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారు.

**తీరొక్క రూపాల్లో..**

భద్రాచలం పట్టణంలో కూనవరం, చర్ల రోడ్డు, బిడ్జి సెంటర్‌లల్లో ప్రధానంగా విక్రయ దుకాణాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ వివిధ రూపాల్లో భక్తులను ఆకర్షించే విధంగా కళాకారులు విగ్రహాలను తయారు చేస్తున్నారు. మరి కొందరు విక్రయదారులు అంబేద్కర్ సెంటర్, ఐటీడీఏ రోడ్డులో తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేసుకుని విగ్రహాలను విక్రయిస్తారు. 3 నుంచి 12 అడుగులు ఉండే విగ్రహాలకు ప్రజల నుంచి అధికంగా డిమాండ్ ఉంది. ఎత్తు, ఆకృతిని బట్టి ఒక్కో విగ్రహానికి రూ.4 వేల నుంచి రూ.30 వేల వరకు విక్రయిస్తున్నారు.

**ఎనిమిది నెలలుగా తయారీ..**

భద్రాచలం పట్టణంలోని బిడ్జి సెంటర్‌లో రాజస్తాన్‌కు చెందిన వారు, చర్ల రోడ్డులో స్థానిక కళాకారులు ఎనిమిది నెలలుగా గణనాథులను తయారు చేస్తున్నారు. విగ్రహాల తయారుకు సంబంధించిన ముడి సరుకులు, రంగులు వరంగల్, హైదరాబాద్ నుంచి కొనుగోలు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ ఏడాది భద్రాద్రి కేంద్రంగా తయారి దుకాణాలలో సుమారు వెయ్యి వరకు విగ్రహాలు అందుబాటులో ఉన్నట్లు విక్రయదారులు తెలుపుతున్నారు.

## సిద్ధమవుతున్న మండపాలు

**మణుగూరురూరల్:** ఆది దేవుడిగా కొలిచే వినాయకుడి నవరాత్రోత్సవాలకు భక్తులకు సిద్ధమవుతున్నారు. కాగా సెప్టెంబర్ 7వ తేదీన వినాయకచవితి వేడుకలు ప్రారంభం కానుండడంతో ఇప్పటికే అనేక ప్రాంతాల్లో ఉత్సవ కమిటీలుగా ఏర్పాటయయ్యాయి. తమకు నచ్చిన విగ్రహాలను ముందుగానే అడ్వాన్స్‌లు ఇచ్చి ఎంపిక చేసుకుంటున్నారు. విగ్రహాలను వాహనాల ద్వారా వినాయకచవితి రోజున, ముందు రోజున ఏర్పాటు చేసుకున్న మండపాల్లో కొలువుదీరుస్తారు. ఈ సారి వీధి వీధిన, సందు సందున గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగే అవకాశం ఉంది. పెద్ద సంఖ్యలో గణనాథులు కొలువుదీరనున్నట్లు తెలుస్తోంది. ఉత్సవాలకు రాజకీయ ప్రాముఖ్యత కనిపించే అవకాశమూ లేకపోలేదు.

**విగ్రహాల తయారీ ఇలా..**

కొబ్బరి పీచు, బంక మట్టి, తెల్ల సున్నం, కర్రలతో ఈ గణపతి విగ్రహాలను తయారు చేస్తారు. వినాయక ఆకారాలు కలిగిన అచ్చులను వినియోగించి బంకమట్టి మిశ్రమాన్ని అచ్చులుగా వేస్తారు. ఇలా వేసిన అచ్చులను రెండు, మూడు రోజుల పాటు ఎండబెట్టిన తర్వాత తయారీదారులు ఏమైనా లోటుపాట్లు ఉంటే సరి చేస్తారు. పూర్తి స్థాయిలో తయారైన విగ్రహాలకు వివిధ రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్ది సిద్ధం చేస్తారు. అయితే ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారు చేసే విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు ఉంటుందని, మట్టి విగ్రహాలనే పూజించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.



గణేష్ మండపం..

### వంశ పారంపర్యంగా ఇదే వృత్తి



రాజస్తాన్ జోగ్‌పూర్‌లో మా ఇంట్లో గణపతి విగ్రహాల తయారీ చేస్తుంటే చూసి నేర్చుకున్నాను. మా కుటుంబ సభ్యులు అందరు విగ్రహాల తయారీ చేస్తారు. ఈ క్రమంలో నాకు వివిధ రూపాల్లో గణనాథుల అందంగా తీర్చిదిద్దటం అలవాటైంది. రాజస్తాన్‌కు చెందిన వారు ఇక్కడ విగ్రహాలు తయారి చేస్తుండడంతో పని చేయడానికి వచ్చాను.

– కిషన్, రాజస్తాన్

### తయారీని చూసి నేర్చుకున్నా



భద్రాచలంలో రాజస్తాన్‌కు చెందిన కొందరు విగ్రహాలు తయారు చేస్తుంటే చూసి నేర్చుకున్నాను. తరువాత బాబాయి సహకారంతో పదేళ్లుగా విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నాం. ప్రతి ఏటా రెండు వందల వరకు తయారు చేసి విక్రయించే వాళ్ళం. ఈ ఏడాది 500 వందల వరకు విగ్రహాలు విక్రయానికి ఉంచగా ఇప్పటికే సగం బుక్ అయ్యాయి.

– రాజా, జగదీష్ కాలనీ

### పోలీసుల అనుమతి తీసుకోవాలి



గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకునే ఉత్సవ కమిటీ సభ్యులు మండపాల ఏర్పాటు, సౌండ్ సిస్టం వంటి వాటికోసం ముందుగానే పోలీసుల అనుమతి తీసుకోవాలి. మండపాల వద్ద ఉండే కమిటీ సభ్యులు తమ పేర్లు, వివరాలను పోలీస్‌స్టేషన్‌లో అందజేయాల్సి ఉంటుంది. నిమజ్జనం వరకు ప్రశాంత వాతావరణంలో కార్యక్రమాలు జరగాలి.

– రవీందర్‌రెడ్డి, మణుగూరు డీఎస్పీ

# రోజంతా జోరు వాన



ములకలపల్లి: ముత్యాలంపాడు శివారులోని పాలవాగు డైవర్షన్ రోడ్డుపై ప్రవాహ ఉధృతి



బూర్గంపాడు-సోంపల్లి రహదారిపై పొంగి ప్రవహిస్తున్న వరదనీరు

**బూర్గంపాడు:** శనివారం కురిసిన భారీ వర్షానికి మండలంలో జనజీవనం స్తంభించింది. భారీవర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. భారీవర్షంతో పంటచేలలోకి వరదనీరు చేరింది. చెరువులు,కుంటలు అలుగులు పోశాయి. సారపాక, బూర్గంపాడులలోని లోతట్టు కాలనీలలో ఇళ్లలోకి వర్షపునీరు చేరటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. పెదవాగు, వెదుర్ల వాగు, దోమలవాగు పొంగి ప్రవహిస్తున్నాయి. కిన్నెరసాని ప్రాజెక్టుకు భారీగా వరదనీరు చేరుతుండటంతో మూడు గేట్లు ఎత్తి దిగువకు నీరు వదులుతున్నారు. దీంతో మండలంలోని ఉప్పుసాక, పినపాక, సోంపల్లి, బుడ్డగూడెం, బూర్గంపాడు గ్రామాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు. ఆ మేరకు చాటింపు వేశారు.

**అన్నపురెడ్డిపల్లి:** మండల వ్యాప్తంగా శనివారం జోరు వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు సాగు నీటి కోసం ఇబ్బందులు పడ్డారు. వర్షం కురుస్తుండడంతో పంటలకు ప్రాణం పోసినట్లైంది. శనివారం రోజంతా కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

**గుండాల:** గత రెండు రోజులుగా ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో గిరిజన గ్రామాలకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఆయా మండలాల్లో కిన్నెరసాని, మల్లన్న వాగు, తొట్టివాగు, దున్నపోతుల వాగు, జల్లేరు వాగులు ఉధృతంగా పారుతున్నాయి. ఎగువ నుంచి వస్తున్న వరదలతో వాగులు ఉగ్రరూపం దాల్చుతున్నాయి. నాగారం, పాలగూడెం, కొడవటంచ, మల్లెల గుంపు, దొంగతోగు, మటంలంక, చంద్రాపురం, అడవిరామారం, రాఘవాపురం, సీతానగర్, రాయిగూడెం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎప్పటికప్పుడు అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

**ములకలపల్లి:** మండలవ్యాప్తంగా శనివారం రోజంతా వాన కురుస్తూనే ఉంది. ఎడతెరిపిలేకుండా కురిస్తున్న చిరుజల్లులకు జనజీవనం స్తంభించింది. ముర్రేడు, పాములేరు. పాలవాగు, సాకివాగు, సంగెళ్ల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ నుంచి వరవళ్లు తొక్కుతున్న వరద ప్రవాహానికి మధ్యతరహా నీటపారుదల జలాశయం మూకమామిడి ప్రాజెక్ట్ అలుగు పోస్తోంది. ముత్యాలంపాడు శివారు పాలవాగు వద్ద డైవర్షన్ రోడ్డుపై ఉధృతంగా ప్రవాహం సాగడంతో, రాకపోకలు నిలిపోయాయి. రాచన్నగూడెం, ముత్యాలంపాడు జీపీ పరిధిలోని పలుగ్రామాల ప్రజలు జల దిగ్బంధనంలోనే గడపాల్సి వచ్చింది.



గుండాల: కిన్నెరసాని లోలెవల్ వంతెనపై ఉప్పొంగి ప్రవహిస్తున్న కిన్నెరసాని వాగు



ములకలపల్లి: అలుగు పోస్తున్న మూకమామిడి ప్రాజెక్ట్..

### కాంగ్రెస్ నాయకుడి జన్మదిన వేడుకలు



కోటేశ్వరరావుతో కేక్ కట్ చేయిస్తున్న మంత్రి పొంగులేటి

**భద్రాచలం:** భద్రాచలం కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి దొడ్ల కోటేశ్వరరావు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సమక్షంలో మంత్రి పొంగులేటి కేక్‌ను కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా భద్రాచలంలో మండల కార్యాలయంలో, వృద్ధాశ్రమంలో సంబురాలను జరిపారు. వృద్ధులకు అన్నదానం చేశారు. నాయకులు సరెళ్ల నరేష్, బలుసు నాగ సతీష్, రామకష్టా రెడ్డి పాల్గొన్నారు.

### సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

**మణుగూరురూరల్:** భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి కన్వీనర్ ముస్కు శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. మణుగూరు మండల, పట్టణ పరిధిలోని ప్రతీ బూత్‌లో సుమారు 200మంది సభ్యత్వాలను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పినపాక నియోజకవర్గ కన్వీనర్ పున్నం బిక్షపతి, జిల్లా కార్యదర్శి, పట్టణ సభ్యత్వ ప్రముఖ్ ముత్యాల వెంకటేశ్వరరావు, బోగే చందర్‌రావు, మధుసూధన్, ఈసాల వెంకటేశ్వర్లు, దంతులూరి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏరియాలో 67శాతం ఉత్పత్తి





వివరాలు వెల్లడిస్తున్న జీఎం రాంచందర్

**మణుగూరుటౌన్:** ఆగస్టు నెలలో మణుగూరు సింగరేణి ఏరియాలో 67శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైందని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. జీఎం కార్యాలయంలో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. ఆగస్టు నెల 7.98 లక్షల టన్నుల లక్ష్యంలో వర్షాల కారణంగా 5.36 లక్షల టన్నులు ఉత్పత్తి సాధించామని పేర్కొన్నారు. అలాగే, 11 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 8.87లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీశామని తెలిపారు. వర్షాల నేపథ్యాన ప్రత్యేక ప్రణాళికతో లక్ష్యసాధనకు కృషి చేస్తుండగా, కార్మికుల గైర్హాజరు శాతాన్ని తగ్గించేందుకు కౌన్సెలింగ్ నిర్వహించామని వెల్లడించారు. సమావేశంలో అధికారులు శ్యాంసుందర్, ఆర్.వెంకటేశ్వర్లు, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, సలగల రమేశ్, కె.వెంకటేశ్వర్లు, మేరీకుమారి, శ్రీనివాస్, సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి భగీరథ కార్మికుల సమ్మె

**భద్రాచలంటౌన్:** భద్రాచలం మండలంలో మిషన్ భగీరథ పథకంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు నేటి నుంచి సమ్మె చేస్తున్నట్లు ఆయా శాఖ అధికారులకు శనివారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఐదు నెలలుగా కాంట్రాక్టర్ చెల్లించక పోవడంతో తీవ్ర ఇంబ్బందులు పడుతున్నాట్లు వాపోయారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను నిలతీయగా నాకు ప్రభుత్వం నుంచి 18 నెలలుగా బిల్లులు నిలిపివేసిందని, వేతనాలు చెల్లించలేనని చెప్పిన్నట్లు కార్మికులు పేర్కొన్నారు. ఈ క్రమంలో విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నామని పట్టణ ప్రజలు తమకు సహకరించాలని కార్మికులు కోరారు.

**దుమ్ముగూడెం:** మండలంలోని పర్ణశాల మిషన్ భగీరథలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు నేటి నుంచి తమ విధులను బహిష్కరిస్తున్నట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత 5 నెలలుగా జీతాలు ఇవ్వక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, శాఖ అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సంబంధిత కాంట్రాక్టర్‌కు సమస్యను తెలిపితే గత 18 నెలలుగా మరమ్మతులు, వేతనాలకు సంబంధించి ఎటువంటి బిల్లులు మంజూరు కాలేదని అన్నారు. ఈ నేపథ్యంలో విధులను బహిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, దాస్, అశోక్, శ్రీను, సాయిచంద్, శ్రీకాంత్, సోమరాజు, పవన్‌కుమార్, సతీష్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# జాగ్రత్తలతో ఆరోగ్యం పదిలం



కరకగూడెం: నిల్వ ఉన్న మురుగు నీటిని పారబోయిస్తున్న వైద్యాధికారి కారం మధు



మణుగూరురూరల్: వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శివకుమార్

**కరకగూడెం:** సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటిస్తేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం మండల పరిధిలోని రాయన పేట, అనంతారం, చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి సుమారు 92 మందిని పరీక్షించారు. 09మందిని జ్వరపీడితులుగా గుర్తించి మందులను అందజేశారు. ఇళ్ల ఆవరణాల్లో నిల్వ ఉన్న నీటిని సిబ్బందితో పారబోయించారు. సీజనల్ వ్యాధుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ పోలెబోయిన కృష్ణయ్య, హెచ్ఏ కృష్ణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**మణుగూరురూరల్:** వ్యాధుల నివారణకు పరిశుభ్రత పాటించాలని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ సూచించారు. శనివారం మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామాలైన బుగ్గ, ఖమ్మం తోగులలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరాలు నిర్వహించారు. వెద్యాధికారి శివకుమార్ పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి నివారణ మందులను పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది ఇంటింటిని సందర్శించి నీటి నిల్వ ఉన్న కంటైనర్లను శుభ్రం చేయించారు. సబ్ యూనిట్ అధికారి వీరస్వామి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# 5న కలెక్టరేట్ ఎదుట ధర్నా

**మణుగూరుటౌన్:** పెండింగ్‌లో ఉన్న 1.30లక్షల ఎకరాలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు ఎల్లయ్య పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలోఆయన మాట్లాడుతూ... జిల్లాలో 2.80 లక్షల ఎకరాలకు పోడు భూములకు పట్టాలు అర్హత పొందినా అందరికీ పట్టాలు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా సాగులో ఉన్న పోడు భూములకు పూర్తిస్థాయిలో పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలనలో గుర్తించిన రేషన్‌కార్డులు, ఇంటి స్థలాలు, పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు దుర్గ్యాల సుధాకర్, సాందె కుటుంబరావు తదితరులు ఉన్నారు.

**గుండాల:** సెప్టెంబర్ 5న కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించచే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పరమ ఇమ్మానియేల్, సీపీఐ మండల సహాయ కార్యదర్శులు కొమరం హనుమంతరావు, నరేడ్ల రాంబాబులు పిలుపునిచ్చారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనిదినాలు 200రోజులు పెంపు, రోజు వారి కూలీ రూ.700లు చెల్లించాలని, అర్హత గల పోడుభూములకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు, తెల్లరేషన్ కార్డులు, ఇళ్లు, పెన్షన్లు, మంజూరు, షరతులులేని రుణమాఫి తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి కుంట సహదేవ్, రైతు సంఘం నాయకులు గోగ్గల శ్రీను, సీపీఐ మండల నాయకులు దీకొండ మల్లేష్, మలిపెద్ది లాజర్ తదితరులు పాల్గొన్నారు.

# చెమ్మగిల్లిన ‘మన బడి’



చెమ్మ నీటితో పాఠశాల గోడలు, శ్లాబు

**అశ్వారావుపేట:** మన ఊరు–మన బడి పేరుతో ఆర్భాటంగా చేపట్టిన పనులు తూతూ మంత్రంగా నిర్వహించడంతో అశ్వారావుపేట ప్రాథమికోన్నత పాఠశాల గోడలు చెమ్మగిల్లి, శ్లాబులు కురుస్తున్నాయి. శనివారం కురసిన వర్షానికి పాఠశాల భవనాల శ్లాబుల నుంచి నీళ్లు కారి వరండాలు నీళ్లమయమయ్యాయి. రంగులు వచ్చినా.. రంగులు వేసే నిపుణులు రాకపోవడంతో పాత గోడలే.. వాటికి వేసిన మాసికలే దర్శనమిస్తున్నాయి. సుమారు రూ.10లక్షలతో అభివృద్ధి పనులు నిర్వహించినా.. ప్రయోజనం శూన్యం. పనులు నిర్వహించిన కాంట్రాక్టర్‌కూ బిల్లులు చెల్లించలేదట.

### బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలి

**గుండాల:** టీజీ ఆర్టీసీ దివ్యాంగులకు అందించే ఉచిత బస్ పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఇల్లెందు డిపో ఆర్టీసీ ప్రతినిధి ఠాగూర్ అన్నారు. ఈ మేరకు బస్‌పాస్‌ల కోసం మండల కేంద్రంలో శనివారం దివ్యాంగుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత పాస్‌ల కోసం ఆధార్, సదరం సర్టిఫికెట్ జిరాక్స్‌తో పాటు, పాస్‌ఫొటో, రూ.50 రుసుం చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.